క్లుప్తంగా

ఈ నీటిని తాగలేం..!



లేత పసుపు రంగులో ఉన్న కుళాయి నీరు

ఆరిలోవ: ఆరిలోవలో పలు ప్రాంతాలలో జీవీఎంసీ సరఫరా చేస్తున్న కుళాయి నీరు రంగు మారింది. లేత పసుపు రంగులో నీటి సరఫరా జరుగుతుండంతో స్థానికులు తాగడానికి వినియోగించలేకపోతున్నారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీఐసీ పాయింట్, అంబేడ్కర్‌నగర్, ముస్తఫాకాలనీ, డ్రైవర్స్‌కాలనీ, బాలాజీనగర్ ప్రాంతాలలో వారం రోజులుగా రంగు మారిన నీరే సరఫరా అయింది. అందులో చిన్నపాటి చెత్త కూడా ఉంటుందని స్థానిక మహిళలు చెబుతున్నారు. పైపులు ఎక్కడైనా లీక్ అయ్యాయా? లేదా నీరు సరిగా వడకట్టడం లేదా? అంటూ స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ నీటి సరఫరా అధికారులు స్పందించి నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలని కోరుతున్నారు.

సీపీఎం ఇంటింటి పాదయాత్ర



మద్దిలపాలెంలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం నాయకులు, కార్యకర్తలు గురువారం మద్దిలపాలెంలో ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 26న తలపెట్టిన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు.

అధ్వానంగా తీర పరిసరాలు



ఆర్కే బీచ్‌లో పేరుకుపోయిన చెత్త

బీచ్ రోడ్డు: తీరం పరిసరాలు అధ్వానంగా మారాయి. భారీ కెరటాలకు సముద్రంలోని చెత్తా చెదారం ఒడ్డుకు కొట్టుకొస్తోంది. దీంతో ఎప్పుడు శుభ్రంగా కనిపించే సాగరతీరం ప్రస్తుతం అధ్వానంగా దర్శనమిస్తోంది.

బీఎన్‌ఆర్ నగర్‌లో వాటర్ ట్యాంక్ ఏర్పాటు



వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు తోటగరువు సమీప బీఎన్‌ఆర్ నగర్ కొండవాలులో పాడైన పాత సింటెక్స్ ట్యాంక్ తొలగించి గురువారం కొత్తది ఏర్పాటు చేశారు. ఇక్కడ గతంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ శిథిలమైంది. దీంతో నీరు వృథాగా పోతుండేది. స్థానికులు నీటి కోసం ఇబ్బందిపడేవారు. ఈ సమస్యను స్థానికులు ఇటీవల వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు ఈ సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు సమస్య పరిష్కారమైంది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు, నీటి సరఫరా విభాగం అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

శరీరం మాట వినండి

- వేసవిలో డీహైడ్రేషన్‌పై అప్రమత్తత అవసరం
- ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవడం శ్రేయస్కరం

ఏయూ క్యాంపస్ : భానుడి ప్రతాపంతో నిప్పుల వర్షం కురుస్తోంది. ఉదయం 9 గంటల నుంచి ఎండ వేడి చుర్రున తాకుతోంది. ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటేనే భయమేస్తోంది. శరీరం డీహైడ్రేషన్(నిర్జలీకరణం)కు లోనవుతోంది. ప్రజలు తమ శరీరంలో తగిన స్థాయిలో నీటిని కలిగి ఉండాల్సిన పరిస్థితి ఉంది. వేసవి సమయంలో చెమట కారణంగా నీరు బయటకు పోవడం సర్వసాధారణం. శరీరంలోని ద్రవాల సమతాస్థితిలో ఉండేలా చూసుకోవాలి. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే డీహైడ్రేషన్ నుంచి మనల్ని మనం కాపాడుకోవడం సాధ్యపడుతుంది.

డీహైడ్రేషన్

మానవ శరీరంలో 70 శాతం వరకు నీరు ఉంటుంది. వేసవిలో ఇది తగ్గిపోవడంతో శరీరంలో శక్తి సన్నగిల్లుతుంది. దీనినే డీహైడ్రేషన్‌గా అంటారు. అధికంగా చెమట పట్టడం, వాంతులు, విరేచనాలు వంటివి వచ్చినప్పుడు శరీరంలో నీరు కోల్పోతాం. అధికంగా శారీరక వ్యాయామం చేసిన సమయంలో కూడా శరీరంలోని నీటి శాతం తగ్గిపోతుంది. డీహైడ్రేషన్ వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్స్ కోల్పోతాం.

గుర్తించడం కష్టం

శరీరం డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు గుర్తించడం ఎంతో కష్టం. కడుపులో తిప్పడం, గొంతు పొడిబారిపోవడం, అధికంగా దాహం వేయడం, గుండెదడ, కళ్లు తిరగడం, తరచూ తలనొప్పి రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటిని గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరం.





తాగాల్సిన నీటి లెక్క ఇలా..

వ్యక్తి నిత్యం ఎంత నీరు తాగాలనే విషయంపై అందరికీ సందేహం ఉంటుంది. దీనికి ఒక సులభ సూత్రం ఉంది. వ్యక్తి బరువును 10 అంకెతో భాగించి, వచ్చిన సంఖ్యలో నుంచి 2ను తీసివేయాలి. మిగిలిన సంఖ్య వ్యక్తి తాగవలసిన నీటి లీటర్ల సంఖ్యను తెలియజేస్తుంది. ఉదాహరణకు 62 కేజీల బరువున్న వ్యక్తిని తీసుకుంటే.. బరువును 10తో భాగిస్తే 6.2 అంకె వస్తుంది. దీని నుంచి 2 తీసివేస్తే 4.2 వస్తుంది. 60 కేజీల బరువు కలిగిన వ్యక్తి 4.2 లీటర్ల నీటిని తాగాల్సి ఉంటుంది. పరిమితికి మించి నీటిని తాగడం సైతం సమస్యలకు దారితీసే అవకాశం ఉంది.

బరువు	తాగాల్సిన నీరు
50	3 లీటర్లు
55	3.5 లీటర్లు
60	4 లీటర్లు
65	4.5 లీటర్లు
70	5 లీటర్లు

ఐస్ వాటర్‌కు దూరంగా..

వేసవి కాలంలో వీలైనంత వరకు ఐస్ వాటర్‌కు దూరంగా ఉండాలి. మన శరీర ఉష్ణోగ్రత 98.6 డిగ్రీల ఫారన్‌హీట్‌ను కలిగి ఉంటుంది. దీనికి సరిపడే గోరువెచ్చని, సాధారణ నీటిని, కుండలో ఉండే నీటిని తాగడం ఎంతో మంచిది. తద్వారా శరీర ఉష్ణోగ్రతను సరైన స్థితిలో ఉంచడం సాధ్యపడుతుంది. శరీర మెటబాలిజం సక్రమంగా ఉండటానికి ఇది సహకరిస్తుంది. ఐస్ వాటర్ తాగడం వల్ల శరీర మెటబాలిజం దెబ్బతినే అవకాశం ఉంది. అదే విధంగా శరీరంలో తగిన ఉష్ణోగ్రత ఉంటే శక్తి కేలరీలు ఖర్చవుతాయి. గోరువెచ్చని నీటిని తాగడం వల్ల శరీరంలోని చెడు మలినాలు తొలగిపోతాయి. శ్వాస సంబంధ సమస్యలు పరిష్కారమవుతాయి.

జాగ్రత్తలు అవసరం



డీహైడ్రేషన్‌కు గురయ్యామనే సందేహం కలిగినప్పుడు కనీసం 2 నుంచి 4 లీటర్ల వరకు నీరు తాగే ప్రయత్నం చేయాలి. నీటిలో పంచదార, ఉప్పు, నిమ్మరసం కలిపి తాగితే మంచిది. పలచటి మజ్జిగలో కొంచెం ఉప్పు, నిమ్మరసం కలిపి తీసుకోవడం మంచిది. దీనిలో ఒక టేబుల్ స్పూన్ శొంఠిపొడిని కలిపి తీసుకోవచ్చు. అరటి పండు తక్షణ శక్తిని ఇస్తుంది. సహజంగా లభించే అన్ని రకాల పండ్లు తీసుకోవచ్చు. సబ్జా గింజలు నీటిలో కలిపి, నిమ్మకాయ, పంచదార వేసుకుని తీసుకోవచ్చు. మధుమేహం ఉన్నవారు పంచధార లేకుండా సబ్జాగింజలను నీటితో, నిమ్మకాయ కలిపి తీసుకోవచ్చు. బార్లి, సగ్గుబియ్యం వంటివి తీసుకోవాలి. వేసవిలో లభించే తాటిముంజలు, పుచ్చకాయ, మామిడి పళ్లలో పుష్కలంగా కాల్షియం ఉంటుంది. అరటి, మామిడి, చిలగడ దుంపలు, కొబ్బరినీరులో పొటాషియం లభిస్తుంది. ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ నుంచి బయట పడవచ్చు.

– డాక్టర్ ఎం.రాజేశ్వరి, ఏయూ ఫుడ్ న్యూట్రిషన్ విభాగం

ఎన్‌ఎస్‌ఎస్‌తో విద్యార్థుల్లో సేవా స్ఫూర్తి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని పెంచేలా ఎన్‌ఎస్‌ఎస్ నిలుస్తుందని ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం ఏయూ ఫార్మసీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వర్సిటీకి దగ్గరలో ఉన్న రెల్లివీధి ప్రాంతాన్ని దత్తత తీసుకుని వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎన్‌ఎస్‌ఎస్‌లో యువత భాగస్వాములై విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ 7 రోజుల పాటు 7 ప్రత్యేక కార్యక్రమాలను చేపడతామన్నారు. తొలి రోజున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఆచార్యులు జి.గిరిజా శంకర్, వి.గిరిజా శాస్త్రి, కె.ఈశ్వర్ కుమార్, కె.సంతోష్, అరుణ్‌కుమార్, ఎం.సంజయ్ సుమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

బండి చిన్నది.. బరువు పెద్దది



ముడసర్లోవ వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డులో ప్లాస్టిక్ వ్యర్థాల లోడుతో వెళ్తున్న వ్యాను

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతం బీఆర్‌టీఎస్ రోడ్డులో ఓ వ్యాన్ సామర్థ్యానికి మించి లోడుతో వెళ్లడడంతో వాహనచోదకులు ఆందోళన చెందారు. ఆరిలోవ ప్రాంతంలో ఎక్కువగా ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే వ్యాపారాలు జరుగుతున్నాయి. ప్రతి రోజు వ్యర్థాలతో కూడిన పెద్ద సైజు మూటలను చిన్న వ్యాన్లలో ఎత్తులో పేర్చి రీసైక్లింగ్ కంపెనీలకు తరలిస్తుంటారు. గురువారం మూడు వరుసల్లో పేక మేడలా పేర్చిన వ్యర్థాల మూటలతో ఓ వ్యాన్ సింహాచలం వైపు వెళ్తుంది. పైమూటలు ఊగుతూ ఎటువైపు పడిపోతాయో తెలియక వెనక వెళ్తున్న ఇతర వాహనచోదకులు ఆందోళన చెందారు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి పరిమితికి మించి లోడుతో వెళ్తున్న ఇటువంటి వాహనాలపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

క్రైం కార్నర్

మాల మహానాడు నేత త్రిమూర్తులు దుర్మరణం



త్రిమూర్తులు(ఫైల్)

బీచ్ రోడ్డు: ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి పడిపోవడంతో ఉమ్మడి విశాఖ జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు జంగ త్రిమూర్తులు(56) దుర్మరణం చెందారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగదిలిలో నివాసం ఉంటున్న త్రిమూర్తులు ఏయూలో ఉద్యోగం చేస్తున్నారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మీదుగా మద్దిలపాలెం వైపు వస్తుండగా అదుపు తప్పి రోడ్డు మీద పడిపోయారు. తలకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఆయన మృతిపట్ల దళిత నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాసరావు (ఫైల్)

ఎంవీపీ కాలనీ: ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఎం.శ్రీనివాసరావు(51) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎం.శ్రీనివాసరావు గత పదేళ్లుగా షేర్ మార్కెట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇందులో కొంతకాలంగా నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. పలువురు క్లైయింట్స్ కూడా తమ డబ్బులు తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో కొద్ది రోజులుగా మానసిక ఒత్తిడికి గురవుతున్న ఆయన బుధవారం పాడేరు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. అయితే అదేరోజు అర్ధరాత్రి తాను పెద వాల్తేర్‌లోని ఆరెంజ్ హోటల్‌లో ఉన్నానని కుమారుడు జ్యోతి స్వరూప్‌కు మెసేజ్ పెట్టాడు. దీంతో కుమారుడు అక్కడికి వెళ్లి హోటల్ సిబ్బందితో కలిసి రూమ్‌లో చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. దీంతో హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. జ్యోతి స్వరూప్ ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్లాట్‌ఫాం నంబర్-8లో వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్-8లో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్పీ) ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా.. గురువారం ఉదయం 5.45 గంటల ప్రాంతంలో విశాఖ రైల్వేస్టేషన్ 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. ఏదో రైలు నుంచి జారిపడటం గానీ, లేదా రైలు ఎక్కుతున్న సమయంలో జారిపడటం వల్ల గానీ మరణించి ఉండవచ్చు. మృతుడి వయసు సుమారు 30–35 ఏళ్లు ఉంటుంది. ఇతడి వద్ద ఏవిధమైన ఆధారాలు లేవు. ఈ వ్యక్తి పసుపు, తెలుపు రంగు టీ షర్ట్, కాఫీ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మెడలో నలుపు రంగు తాడు, కుడిచేతి మీద నాగుపాము, ఓంకార గుర్తులు పచ్చబొట్లు ఉన్నాయి. ఈ మృతదేహం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ వద్ద స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో తెలియజేయాలని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

బీటీఆర్ నగర్‌లో వైద్య శిబిరం

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి బీటీఆర్ నగర్‌లో గురువారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన స్థానికులకు బీపీ, మధుమేహం, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, మహ్మద్ హుస్సేన్, బి.సూర్యారావు, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్త వెంకోజీపాలెంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సద్గురు సాయి అసోసియేషన్ సభ్యులు

మద్దిలపాలెం: వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం కొత్త వెంకోజీపాలెంలో సద్గురు సాయి అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. బస్టాప్ వద్ద వేచి ఉండే ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు



రాష్ట్ర సంక్షేమం కోసం ప్రార్థనలు చేస్తున్న బిషప్ డాక్టర్ ఏజీ తంగచ్చన్

ఎంవీపీ కాలనీ: ఆంధ్రప్రదేశ్ కోస్టల్ ఫెలోషిప్ చర్చెస్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రగతి, సంక్షేమం కోసం వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో బిషప్ డాక్టర్ ఏజీ తంగచ్చన్ ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రార్థనలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి పాస్టర్లు, క్రీస్తు బోధకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రవక్త జిమ్మీ తంగచ్చన్, పాస్టర్లు వి.జ్యోతిబాబు, వి.ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

22వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్తు'



ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

బీచ్ రోడ్డు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం గురువారం 22వ వార్డులోని తార మసీద్ ప్రాంతంలో జరిగింది. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఇంటింటికీ వెళ్లి పథకాలపై అవగాహన కల్పించారు. సంక్షేమ ఫలాలు ఇంటి వద్దకే అందుతున్నాయో? లేదో? అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

పుస్తకాల బహూకరణ



పుస్తకాలు బహూకరిస్తున్న డాక్టర్ సులేమాన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగానికి డాక్టర్ సులేమాన్ పలు పుస్తకాలను బహూకరించారు. విభాగ విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఉపయుక్తంగా రూ.3 వేలు విలువ చేసే పుస్తకాలను గురువారం విభాగాధిపతి డాక్టర్ జి.వీ రాజుకు అందజేశారు. డాక్టర్ సులేమాన్ విభాగంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు. ఈయన భారత ప్రభుత్వంలో ఉన్నతోద్యోగిగా సేవలు అందించి పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డాక్టర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రసేన పాలకు వర్సిటీ డాక్టరేట్



వీసీ నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఇంద్రసేనపాల

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగ పరిశోధక విద్యార్థి ఇంద్రసేన పాలకు ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ విశ్రాంత ఆచార్యులు ఇ.ఎ.నారాయణ, డాక్టర్ పి.ప్రేమానందం సంయుక్త పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ ఎన్‌జీవో ఇన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఇన్ నార్త్ కోస్టల్ డిస్ట్రిక్ట్స్–ఆంధ్రప్రదేశ్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ఇంద్రసేన పాల స్వీకరించారు.

పెనాల్టీల నుంచి ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి



బ్యాంకు చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట : బ్యాంకులు పెనాల్టీలు, చార్జీల నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు మినహాయింపు ఇవ్వాలని ఉద్యోగ సంఘాల కార్యాచరణ సమితి (అమరావతి) జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన జరిగింది. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట జరిగిన ప్రదర్శనలో జేఏసీ చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ బ్యాంకులు విధించే పెనాల్టీల వల్ల ఉద్యోగుల సిబిల్ స్కోరు తగ్గిపోతుందని, దీని నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చి, అదనపు భారాన్ని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ రమేష్, కోశాధికారి రవిశంకర్, జేఏసీ కో చైర్మన్ నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి మహేష్, ఉద్యోగులు, పెన్షనర్లు హాజరయ్యారు. అనంతరం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.

'కార్మికులపై మోదీ ప్రభుత్వం దాడి'



బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

ఆరిలోవ: కార్మికులు, రైతులు, ప్రజానీకంపై కేంద్రంలో మోదీ ప్రభుత్వం దాడి చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ తెలిపారు. మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 14 నుంచి 30 వరకు చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా సీపీఎం, సీపీఐ నాయకులు గురువారం ఆరిలోవ ప్రాంతం జైభీంనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఈ నెల 26న స్టీల్‌ప్లాంట్ ఆర్జ్ వద్ద కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహించనున్న బహిరంగ సభను ప్రజలు, రైతులు, కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు రెహ్మాన్, పలువురు సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ, విశాఖ డెయిరీ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు ముందు కొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవికాలం అంతా చలివేంద్రం నిర్వహిస్తారని అన్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి 100 నుంచి 200 మంది అర్జీదారులు వస్తారని, వారికి భోజనం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో కూడా చలివేంద్రం ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విశాఖ డెయిరీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ ఎస్‌కేఎల్ రావు, విశాఖ డెయిరీ మార్కెటింగ్ మేనేజర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఉచిత శిక్షణకు విశేష స్పందన

మురళీనగర్: పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులకు విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 17న కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో పదో తరగతి విద్యార్థుల కోసం ఉచితంగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. బ్యాచీకి 60 మంది చొప్పున తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాల బోధనకు ప్రత్యేకంగా ఫ్యాకల్టీని నియమించారు. గైస్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ గణిత బోధన తరగతులు నిర్వహించడం విశేషం. శిక్షణ అనంతరం విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ ఇస్తారు.